డ్రైనేజీ పనులు పరిశీలన

వానలు కురిసినపుడు సమస్యలు తలెత్తకుండా అధికారులు నానల్‌నగర్, టోలిచౌకి డివిజన్లలో డ్రైనేజీ మరమ్మతులు చేపట్టారు. సోమవారం పనులను జీహెచ్‌ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు, నానల్‌నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్, డిప్యూటీ ఈఈ రామకృష్ణ, ఏఈ ఉదయ్‌తో కలిసి పరిశీలించారు. పనుల్లో నా ణ్యతా ప్రమాణాలు పాటించి సకాలంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

- మెహిదీపట్నం

అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నాం

కాచిగూడ, డిసెంబర్ 9 : ప్రజల అండదండలతో అంబర్‌పేట నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నానని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. బీజేపీ ఎమ్మెల్యే హయాం అంబర్‌పేట నియోజకవర్గంలో తాగునీరు, డ్రైనేజీ పైపులైన్ల సమస్యలను పట్టించుకోక పోవడంతో ప్రస్తుతం అనేక సమస్యలు పుట్టుకొస్తున్నాయని మండిపడ్డారు. నింబోలిఅడ్డా రామకృష్ణ దవాఖాన సమీపంలోరూ.12 లక్షలతో నూతన తాగునీటి పైపులైన్ పనులను సోమవారం కాచిగూడ కార్పొరేటర్ ఉమా యాదవ్‌తో కలిసి ఎమ్మెల్యే కాలేరు ప్రారంభించారు. అనంతరం నింబోలిఅడ్డాలోని పలు బస్తీల్లో ఎమ్మెల్యే పర్యటించి స్థానికుల నుంచి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజల సహకారంతో అంబర్‌పేటను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలోని అన్ని బస్తీ, కాలనీల్లో నీరు, డ్రైనేజీ పైపులైన్, రోడ్లను వేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం కృష్ణ, ఏఈ భావన, వర్క్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్‌యాదవ్, సునీల్ బిడ్లాన్, కన్నె రమేశ్‌యాదవ్, ఓం ప్రకాశ్‌యాదవ్, నాగేందర్‌బాబ్జి, బబ్లూ సింగ్, సుభాష్ పటేల్, శ్రీకాంత్‌యాదవ్, పట్లూరి సతీశ్ పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్ పనులు ప్రారంభిస్తున్న అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

విజయ్ దివస్ సందర్భంగా ప్రార్థనలు

అబిడ్స్, డిసెంబర్ 9 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు చేపట్టిన ఉద్యమ పంథా, చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షతోనే తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ మైనార్టీ సెల్ నాయకులు ఎం.కె. బద్రుద్దీన్ పేర్కొన్నారు. డిసెంబర్ తొమ్మిది విజయ్ దివస్ సందర్భంగా రాజస్థాన్‌లోని అజ్మీర్ షరీఫ్ ఖాజా గరీబ్ నవాజ్ కిస్తి దర్గాలో చాదర్‌ను సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆనాడు కేసీఆర్ చేపట్టిన దీక్షతోనే మేలు జరిగిందని, రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఉద్యమం ద్వారా కేసీఆర్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టి రెండు సార్లు అధికారాన్ని అప్పగించారన్నారు. పదేండ్లలో సీఎంగా నగరాన్ని దేశంలోనే నంబర్ వన్ సిటీగా అభివృద్ధి చేశారని తెలిపారు. తిరిగి కేసీఆర్ పాలన కావాలని ప్రజలు కోరుకుంటున్నారని, తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని ప్రార్థనలు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మైనార్టీ నాయకులు గౌస్, యూసుఫ్, ఖాజా, షరీఫ్ పాల్గొన్నారు.

అజ్మీర్ దర్గాలో చాదర్ సమర్పించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ మైనార్టీ సెల్ నాయకులు బద్రుద్దీన్

బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వక్తలు

ఉచిత న్యాయం అందించడమే ఆస్రా లక్ష్యం

రవీంద్రభారతి, డిసెంబర్ 9 : వినియోగదారుల ఫోరం ద్వారా నాణ్యమైన సేవలు అందించాలని బీజేపీ సీనియర్ నాయకుడు రామచందర్‌రావు అన్నారు. దేశవ్యాప్తంగా వినియోగదారుల కేసులు ఆస్రా ద్వారా పరిష్కరించడం అభినందనీయమన్నారు. సోమవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో అడ్వకేట్ అసోసియేషన్ ఫర్ సోషల్ రెస్పాన్సిబిలిటీ(ఆస్రా) ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. 15న బెంగళూరులో జరిగే 6వ జాతీయ సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆస్రా వ్యవస్థాపక అధ్యక్షుడు హబీబ్ సుల్తాన్‌తో కలిసి రామచందర్‌రావు ఆవిష్కరించారు.

ఆస్రా ఫౌండర్ హబీబ్ సుల్తాన్ మాట్లాడుతూ.. సంస్థ 2015లో ప్రారంభమై 12 రాష్ట్రాల్లో 1000 మంది స్వచ్ఛంద సేవకులు పనిచేస్తున్నారన్నారు. డిసెంబర్ 15న నిర్వహించే సదస్సుకు కర్నాటక పౌర సరఫరా, వినియోగదారుల వ్యవహారాల మంత్రి శాఖ మంత్రి మునియప్ప, ఐఏఎస్ విజయ్ జ్యోత్స్న హాజరవుతున్నారని చెప్పారు. ఆస్రా తెలంగాణ అధ్యక్షుడు వెంకటేశ్‌గుప్త, కీర్తి, కైలేశ్, ప్రశాంత్, శిరీష పాల్గొన్నారు.

సమస్యను పరిష్కరించండి

బాగ్‌అంబర్‌పేట డివిజన్ మల్లికార్జున నగర్‌ను ఆనుకొని ఉన్న ఉస్మానియా యూనివర్శిటీ నాలా నుంచి వస్తున్న మురుగునీరు, చెట్లకొమ్మల ద్వారా పరిసర ప్రాంతాల్లోని ఇండ్లలోకి పాములు వస్తున్నాయని బస్తీవాసులు వాపోతున్నారు. వెంటనే సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ డివిజన్ కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి ఓయూ రిజిస్ట్రార్ నరేశ్ రెడ్డిని సోమవారం కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు బి.వెంకటరెడ్డి, మిర్యాల శ్రీనివాస్, బస్తీవాసులు సతీశ్, రవి పాల్గొన్నారు.

- అంబర్‌పేట

ఆర్.కృష్ణయ్యకు రాజ్యసభ సీటు కేటాయించడంపై హర్షం

అబిడ్స్, డిసెంబర్ 9 : బీజేపీ కేంద్ర ఎన్నికల కమిటీ ఏపీ రాజ్యసభ అభ్యర్థిగా ఆర్.కృష్ణయ్యను ప్రకటించడంపై బీసీ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి, ఓబీసీ మోర్చా సోషల్ మీడియా జాతీయ సభ్యుడు పెరిక సురేశ్ హర్షం వ్యక్తం చేశారు. రాజ్యసభ అభ్యర్థిగా ఆర్.కృష్ణయ్యను ప్రకటించడంతో ఆయనను కార్యాలయంలో కలిసి అభినందనలు తెలిపారు. కృష్ణయ్య 40 ఏండ్లుగా బీసీల సర్వతోముఖాభివృద్ధికి పాటు పడుతున్నారని కొనియాడారు. తెలుగు రాష్ట్రాల్లో ఆయనకు విశేష ఆదరణ ఉందని అట్టడుగు వర్గాల నాయకుడిని రాజ్యసభ అభ్యర్థిగా నిలబెట్టి ప్రశంసనీయన్నారు.

కాచిగూడ, డిసెంబర్ 9: బీసీల సమస్యలపై పోరాటం చేస్తున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సేవలను గుర్తించి ఆంధ్రప్రదేశ్ నుంచి రాజ్యసభ సీటు కేటాయించడంపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం హర్షం వ్యక్తం చేశాడు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. దేశంలోని 75 కోట్ల మంది బీసీల పక్షాన నిలబడి ప్రాణాలకు తెగించి పోరాడుతున్న వ్యక్తి .కృష్ణయ్య అని పేర్కొన్నారు. 48 యేండ్లుగా బీసీ సమస్యలపై 12 వేలకు పైగా ఉద్యమాలు చేసి పాలకులనే గడగడలడించిన మహోన్నత బీసీ నాయకుడు అని వెల్లడించారు.

హ్యూమన్ రైట్స్ ఎక్స్‌లెన్సీ అవార్డుకు ధనుంజయ్ నాయక్

20 ఏండ్లుగా సమాజ సేవతో పాటు న్యాయ సేవలను అందిస్తూ హక్కులపై అవగాహన కల్పిస్తున్న తెలంగాణ ట్రైబల్ ఇంట్రలెక్చువల్ ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ధనుంజయ్ నాయక్‌ను ఈ యేడాది హ్యూమన్ రైట్స్ ఎక్స్‌లెన్సీ అవార్డు-2024కు ఎంపిక చేయడం జరిగిందని తెలంగాణ సిటిజెన్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ్ ముదిరాజ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా బర్కత్‌పురాలోని రాజాబహదూర్ వెంకటరామిరెడ్డి మహిళా ఫార్మసీ కళాశాలలో నిర్వహించే కార్యక్రమంలో అవార్డును ప్రదానం చేస్తున్నట్లు ఆయన వివరించారు.

- సుల్తాన్‌బజార్

అయ్యప్ప పూజా విధానం పుస్తకాలు పంపిణీ

బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, గురుస్వామి దూసరి శ్రీనివాస్‌గౌడ్ రూపొందించిన శ్రీమణికంఠ అయ్యప్పస్వామి పూజా విధానం పుస్తకాలను సోమవారం బాగ్‌అంబర్‌పేట గురువాయూర్ శ్రీకృష్ణ మందిరం వద్ద దూసరి వెంకట్ గురుస్వామి ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ పుస్తకం అయ్యప్ప స్వాములు పూజా చేసుకోవడానికి సులువుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో గురుస్వాములు ఎస్.లక్ష్మణ్‌గౌడ్, కె.అశోక్‌కుమార్, ఎం.సతీశ్ ముదిరాజ్, తిరుపతిగుప్త, కుమారస్వామి, మాణిక్యం పాల్గొన్నారు.

- అంబర్‌పేట

ఉపాధ్యాయుల కృషి అభినందనీయం

కాచిగూడ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మయ్యను సన్మానిస్తున్న ఓయూ డీన్ రాజేశ్‌కుమార్, వెంకట్రావ్

కాచిగూడ : విద్యార్థుల్లో దాగిఉన్న సృజనాత్మకతను వెలికితీసి, ప్రతిభను నిరూపించడానికి ఉపాధ్యాయులు కృషిచేయడం అభినందనీయమని ఓయూ ఎడ్యూకేషన్ డీన్ ప్రొ. రాజేశ్‌కుమార్ అన్నారు. ఉస్మానియా యునివర్సిటీ ఇంటర్ కాలేజ్ నెట్‌బాల్ టోర్నమెంట్‌లో విద్యార్థులు ప్రతిభ కనబర్చడానికి సహకరించిన కాచిగూడ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ బి.లక్ష్మయ్యను సోమవారం ఓయూ డీన్ రాజేశ్‌కుమార్, అవంతి కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.వెంకట్రావ్ సన్మానించారు. కార్యక్రమంలో ఓయూ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యూకేషన్ ప్రిన్సిపాల్ ప్రొ.బి.సునీల్‌కుమార్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు, టోర్నీ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎస్.సోమేశ్వర్‌రావు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి మహాపడిపూజ

కాచిగూడ, డిసెంబర్ 9 : సంఘసేవకుడు గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్పస్వామి మహా పడిపూజ వైభవంగా నిర్వహించారు. ఉదయం గణపతి హోమంతో పూజ కార్యక్రమంతో ప్రారంభమై మహాపడిపూజ కార్యక్రమంతో ముగిసింది. ముఖ్యఅతిథులుగా కార్పొరేటర్ ఉమ, డాక్టర్ గౌతంరావు, కన్నె రమేశ్‌యాదవ్ విచ్చేసి అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ప్రవీణ్‌గురుస్వామి, చుక్క జగన్, క్షీర్‌సాగర్, భక్తులు పాల్గొన్నారు.

కార్వాన్ సబ్జీమండీలోని ఉప్పర్ బస్తీలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి భక్త సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప పడి పూజలో పాల్గొన్న స్వాములు గోవింద్ గురుస్వామి, శ్రీనాథ్ సాగర్, కునాల్, రాకేష్ సింగ్, శత్రు సింగ్, కార్తీక్, కేమోజు శ్రీనివాస్, మధు, నాగేశ్, రాజు

- కార్వాన్

ఎన్‌పీ-3 పైపులైన్ నిర్మాణ పనుల పరిశీలన

డ్రైనేజీ సమస్యలు లేకుండా అంతటా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తున్నామని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహినుద్దీన్ అన్నారు. సోమవారం సాయంత్రం టోలిచౌకిలో ఎన్‌పీ - 3 పైపులైన్‌నిర్మాణ పనులను ఎమ్మెల్యే, కార్పొరేటర్ ఎండీ.నసీరుద్దీన్, డిప్యూటీ ఈఈ రామకృష్ణతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. డ్రైనేజీ సమస్యలు లేకుండా అభివృద్ధి పనులను చేపడుతున్నామని పేర్కొన్నారు. - మెహిదీపట్నం

ఆలయ పునర్నిర్మాణానికి 11న భూమి పూజ

లంగర్‌హౌస్ డివిజన్‌లో కట్టమైసమ్మ ఆలయ పునర్నిర్మాణానికి 11న భూమి పూజ నిర్వహిస్తున్నామని బుజిలి మహంకాళి ఆలయ కమిటీ చైర్మన్ బోగి పరమేశ్ తెలిపారు. బస్తీ పెద్దలు, పురప్రముఖుల సూచనల మేరకు ఈ కార్యక్రమం చేపడుతున్నామని చైర్మన్ తెలిపారు.

- మెహిదీపట్నం

వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ : ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొ.శశికాంత్ తెలిపారు. ఎంఈడీ రెండో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్, ఇంప్రూవ్‌మెంట్, ఎంఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ (ఎంఆర్/ఐడీ) మొదటి, రెండు, మూడో సెమిస్టర్ బ్యా క్‌లాగ్ పరీక్షలను 18 నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలను వెబ్‌సైట్ www. osmania. ac.inలో చూడవచ్చయన్నారు.